

జూరాలకు తగ్గిన వరద

» విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

6



జూరాల జలాశయంలో నిలకడగా ఉన్న వరద

కార్యకర్త నుంచి కేబినెట్‌లోకి..



మంత్రి వాకిటి శ్రీహరి

మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వాకిటి శ్రీహరి ప్రస్థానమిది

- 1990లో రాజకీయాల్లోకి.. పోటీ చేసిన ప్రతీ ఎన్నికలో విజయం
- నిబద్ధత ఉన్న కార్యకర్తగా పేరు.. గెలిచిన తొలిసారే మంత్రి పదవి
- సర్పంచ్ నుంచి మొదలుకుని.. నేడు మంత్రిగా అవకాశం
- కలిసొచ్చిన సామాజిక సమీకరణలు.. ఉమ్మడి జిల్లాలో సంబురాలు
- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు, నాయకులు



మంత్రి శీహరికి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు జీ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఒక పార్టీని నమ్ముకుని.. నిబద్ధతతో పనిచేస్తే పార్టీ గుర్తించి సముచిత ప్రాధాన్యం ఇస్తుందనడానికి వాకిటి శ్రీహరికి మంత్రి పదవి రావడమే నిదర్శనంగా చెప్పొచ్చు. కార్యకర్త నుంచి కాంగ్రెస్ పార్టీలో ప్రస్థానాన్ని ప్రారంభించిన శ్రీహరి మంత్రి స్థాయికి ఎదిగారు. సాధారణంగా గెలిచిన మొదటిసారే మంత్రి పదవులు రావడం చాలా అరుదు. మంత్రి పదవి రావడానికి సీనియారిటీ, శాఖలపై పట్టును పరిగణలోకి తీసుకుంటారు. కానీ శ్రీహరి గెలిచిన మొదటిసారే మంత్రిగా బాధ్యతలు చేపట్టడానికి పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తగా ఆయనకున్న పేరే కారణమని చెప్పవచ్చు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి మక్తల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసిన ఆయన.. సమీప ప్రత్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై 17,525 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. వాస్తవానికి ఆయన 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఆశించారు. ఆ సమయంలో కాంగ్రెస్, టీడీపీ పొత్తు పెట్టుకోవడంతో మక్తల్ సీటులో టీడీపీ నుంచి దివంగత కొత్తకోట దయాకర్‌రెడ్డి పోటీ చేశారు. దీంతో ఆయన ఆశలు వదులుకున్నారు. 2023లో టికెట్ ఆశించారు. ఆ టికెట్ కోసం మరో ఏడుగురు కూడా పోటీపడ్డారు. ఒక దశలో టికెట్ వస్తుందా? లేదా అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమయ్యాయి. ఎట్టకేలకు టికెట్ దక్కడంతో పోటీపడిన వారు కూడా ఆయనతో కలిసి పనిచేయడంతో భారీ మెజారిటీతో విజయం సాధించారు.

మంత్రి పదవి రావడం ఆనందంగా ఉంది: శ్రీహరి

మక్తల్, (ఆంధ్రజ్యోతి): మంత్రి పదవి రావడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌కు వెళ్తున్న ఆయన మక్తల్‌లో విలేకరులతో మాట్లాడారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన తనకు మంత్రి వర్గంలో స్థానం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీకి అందిస్తున్న తన సేవలను గుర్తించిన అధిష్ఠానం మంత్రి పదవి కట్టబెట్టిందన్నారు. మక్తల్ నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసినట్లు తెలిపారు. మంత్రివర్గంలో చోటు కల్పించడానికి కారకులైన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ ప్రస్థానమిదే..

విద్యార్థి నాయకుడిగా 1990లో రాజకీయాల్లోకి ప్రవేశించిన వాకిటి శ్రీహరి.. 1990 నుంచి 1993 వరకు ఎన్ఎస్‌యూఐ మక్తల్ మండల అధ్యక్షుడిగా పని చేశారు. 1993 నుంచి 1996 వరకు మక్తల్ మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. 1996 నుంచి 2001 వరకు మక్తల్ మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 2001 నుంచి 2006 వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. 2001లోనే మక్తల్ మేజర్ గ్రామ పంచాయతీ నుంచి సర్పంచ్‌గా గెలిచారు. అప్పటి

(మిగతా 7లో..)

కలిసొచ్చిన సమీకరణలు..

వాకిటి శ్రీహరికి మంత్రి పదవి రావడానికి నిబద్ధత కలిగిన కార్యకర్తగా పేరుండటంతో పాటు.. ఉమ్మడి జిల్లాలో మెజారిటీ కొత్త శాసనసభ్యులు ఉండటం కూడా ఒకరకంగా కలిసి వచ్చిందని చెప్పొచ్చు. అలాగే రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీ(ముదిరాజ్) సామాజిక వర్గం నుంచి గత ప్రభుత్వాల్లో ఏకైక ఎమ్మెల్యేగా పనిచేసిన ఈటల రాజేందర్‌కు అవకాశం వచ్చింది. ఇప్పుడు వాకిటి శ్రీహరి కూడా ఆ సామాజికవర్గం నుంచి ప్రాతినిధ్యం ఉన్న ఏకైక ఎమ్మెల్యే కావడం కూడా మరో కారణంగా చెప్పవచ్చు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం హామీ ఇచ్చినప్పటికీ.. మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతూ వచ్చింది. శ్రీహరికి స్పష్టత ఉన్నప్పటికీ.. కార్యకర్తల్లో మరెవరినైనా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందా?.. అదే సామాజికవర్గం నుంచి మరొకరిని ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి కట్టబెడుతుందా? అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. కానీ ఎట్టకేలకు శ్రీహరి మంత్రి పదవి జాక్‌పాట్ కొట్టారు.



స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు గత సంవత్సరం నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆటల బడి.. రమ్మంటోంది

- క్రీడా పాఠశాలల్లో విద్యార్థులకు 4 తరగతిలో ప్రవేశాలు
- రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో స్కూళ్లు
- ఈ నెల 16 నుంచి 19 వరకు మండల స్థాయి..
- 23 నుంచి 26 వరకు జిల్లా స్థాయి..
- జూలై 1 నుంచి 5 వరకు రాష్ట్ర స్థాయి ఎంపికలు
- బాల, బాలికలకు 120 సీట్లు
- నాణ్యమైన విద్య, ఉచిత వసతి
- స్పోర్ట్స్‌లో రాణించేందుకు సదవకాశం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆటల బడి రమ్మంటోంది. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనుకునే విద్యార్థులకు ఇదొక మంచి అవకాశం. క్రీడల్లో ఆసక్తి ఉన్న వారిని ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేస్తూ, కార్పొరేట్ స్థాయి విద్య అందించే మూడు ప్రాంతీయ క్రీడా పాఠశాలలను రాష్ట్రంలో ప్రభుత్వం నడిపిస్తోంది. మేడ్చల్ జిల్లాలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో ఆ స్కూల్స్ ఉన్నాయి. వాటిలో 120(బాలికలు 60, బాలురు 60) సీట్ల కోసం క్రీడా ఎంపికలు నిర్వహించనున్నది. ఎంపికైన వారికి మెరుగైన శిక్షణ ఇస్తూనే, ఇంటర్ వరకు ఉచిత విద్య అందించనుంది.

నాలుగో తరగతిలో ప్రవేశాలు

2025-26 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశాలకు ఎంపిక తేదీలను ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో పాఠశాలలో 40 సీట్లు ఉండగా, బాలికలకు 20, బాలురకు 20 సీట్లలో అవకాశం కల్పిస్తారు. అందు కోసం అర్హత పరీక్షలను నిర్వహిస్తారు. విద్యార్థులకు మండల, జిల్లా స్థాయిలో శారీరక సామర్థ్యానికి సంబంధించిన పరీక్షలను యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి పాఠశాలల్లో అవకాశం కల్పిస్తారు. తర్వాత హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తారు. అక్కడ

(మిగతా 6లో..)

సామాజిక న్యాయం వైపు అడుగులు..

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కొత్తకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంఘాల పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం వైపు అడుగులు వేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం వడ్డెవాటలో ఓ శుభకార్యానికి హాజరయ్యారు. అనంతరం కొత్తకోటలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ముగ్గురు బీసీ, ఎస్సీలకు మంత్రి పదవులు కల్పించడం స్వాగతిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ కమిట్‌మెంట్ ప్రకారంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మొన్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఐదుగురికి అవకాశం ఇవ్వడం శుభ పరిణామమన్నారు. నామినేటెడ్ పదవుల ఎంపిక కూడా ఇలాగే కూడా ఉంటుందని భావిస్తున్నామన్నారు. ఇంతటితో ఊరుకునేది లేదని, మేము ఎంతో మాకు అంత వాటా కోసం పోరాటం చేయడానికి తగ్గేదే లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టి బీసీ జనాభా 56.7 శాతం ఉందని తేల్చిందని, అదే వాటా హక్కుగా రావాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి రామన్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు భీమన్న నాయుడు, బాలరాజుగౌడ్, చంద్రశేఖర్, వెంకట్, జనార్దన్‌గౌడ్, బస్వరాజ్, రంగస్వామి, వెంకటన్నగౌడ్, తిరుపతయ్య, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్



తుమ్మిళ్ల వద్ద టీజీఎండీసీ ఇసుక కేంద్రం

ఇసుక తరలింపులో ఓవర్ యాక్షన్

6

ఇసుక ఓవర్ లోడ్ దందాతో ఇటు ప్రభుత్వానికి గండి పడుతుండగా.. మరోపక్క రోడ్లు ధ్వంసమై ప్రయాణికులకు, ప్రజలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ వ్యవహారం రోజూ కొనసాగుతుండటం.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటం పరిపాటిగా మారింది. ఇలా వెళ్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకుంటే అదికాస్త నిమిషాల్లోనే బయటకు పంపిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొందరు అధికారులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు కూడా ఓ కారణంగా చెప్పవచ్చు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల తుమ్మిళ్ల గ్రామం వద్ద ఈ తంతు సాగుతోంది. టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక కేంద్రం మూడు రోజుల క్రితం తిరిగి ఓపెన్ కావడంతో ప్రతి రోజు 30నుంచి 40 టిప్పర్ల వరకు ఇసుక రవాణా అవుతుండటం గమనార్హం.

- గద్వాల, (ఆంధ్రజ్యోతి)

- » ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- » ఇసుక రీచ్ నుంచి అధిక లోడ్‌తో టిప్పర్లు
- » రీచ్ వద్ద లేని సీసీ కెమెరాలు, వెయింగ్ మిషన్
- » చోద్యం చూస్తున్న విజిలెన్స్, పోలీస్ అధికారులు
- » పట్టుకున్న పది నిమిషాల్లోనే బయటకు టిప్పర్లు
- » చక్రం తిప్పుతున్న అధికార పార్టీ నాయకులు



ఓవర్‌లోడ్‌తో వస్తే కేసులు చేస్తాం

ఇసుక టిప్పర్లు అనుమతి పత్రాలతో వస్తున్నాయా.. లేదా.. అని పరిశీలిస్తున్నాం. ఓవర్‌లోడ్‌తో వస్తే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే పలు టిప్పర్లను పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నాయని తెలిసే వదిలేశాం. మల్దకల్‌లో పట్టుకున్న టిప్పర్ ఓవర్‌లోడ్‌తో వచ్చింది. అందుకే దానిని ఆర్టీవోకు అప్పగించాం.

- మొగులయ్య, డీఎస్పీ గద్వాల

బేడ బుడగ జంగం విద్యార్థినికి ప్రతిభా పురస్కారం

గద్వాల సర్కిల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన గద్వాలకు చెందిన బేడ బుడగ జంగాల విద్యార్థిని పుష్పలీలకు ఆదివారం హైదరాబాద్‌లో బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారం అందజేశారు. శాంతిచక్రం హాల్‌లో సంఘం రాష్ట్ర నాయకులు ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కార కార్యక్రమంలో పుష్పలీలకు ప్రతిభా పురస్కారంతో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. పది ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని నిర్వాహకులు అభినందించారు. తల్లిదండ్రులు గర్వించేలా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ ఆచార్య ఖాసీం, సినీ హీరో నవీన్‌రాజ్, బేడ బుడగ జంగం జాతిపిత డాక్టర్ ఎన్ఆర్ వెంకటేశం, సంఘం వ్యవస్థాపకుడు మన్యం, జాతీయ అధ్యక్షుడు నరసింహ, రాష్ట్ర అధ్యక్షుడు సహదేవ్, యువజన సంఘం అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సిరిగిరి పుష్పలీలకు ప్రతిభా పురస్కారం అందజేస్తున్న రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు చెన్నయ్య

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల మృతి



లక్ష్మమ్మ(ఫైల్)



యాదగిరి(ఫైల్)

నవాబ్‌పేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : బంధువుల ఇంట్లో వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులు మృతి చెందారు. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. నవాబ్‌పేట ఎస్‌ఐ విక్రమ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మరికంటి యాదగిరి (22), తల్లి లక్ష్మమ్మ (50)తో కలిసి ద్విచక్రవాహనంపై రంగారెడ్డి జిల్లా, కొందుర్గు మండలం, ఆగిరాల గ్రామంలో జరిగిన బంధువుల వివాహ వేడుకలకు వెళ్లారు. పెళ్లి అనంతరం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, కొల్లూరు గేటు సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్నది. దీంతో వారిద్దరూ వాహనంపై నుంచి ఎగిరి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు వచ్చి మృతదేహాలను జిల్లా ఆసుపత్రికి తరలించారు. లక్ష్మమ్మ భర్త వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ, బస్సు ఢీకొని క్లీనర్ మృతి

» ఐదుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు

7



ప్రమాదానికి గురైన బస్సు

నిజాలను నిర్భయంగా రాయాలి

- » అలా రాస్తేనే సమాజానికి మేలు
- » అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు వర్తింపజేస్తాం
- » వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

6



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

11న ఎస్టీ బాలికల గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు 6లో..
వేర్వేరు చోట్ల పిడుగుపాటు - నాలుగు పశువుల మృతి 6లో..

భయపెడుతున్న ఎనిమియా

- » జోగులాంబ గద్వాల జిల్లాలో 13,296 మంది గర్భిణులు
- » వారిలో 25 శాతం మందికి రక్తహీనత
- » 21,463లో మంది చిన్నారులలో 584 మంది తీవ్రం

7

ఆవు దూడపై చిరుత దాడి 7

ఇసుక తరలింపులో ఓవర్ యాక్షన్

- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- ఇసుక రీచ్ నుంచి అధిక లోడ్‌తో టిప్పర్లు
- రీచ్ వద్ద లేని సీసీ కెమెరాలు, వెయింగ్ మిషన్
- చోద్యం చూస్తున్న విజిలెన్స్, పోలీస్ అధికారులు



ఓవర్ లోడ్‌తో వచ్చిన టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

గద్వాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండల తుమ్మిళ్ల గ్రామం వద్ద టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక కేంద్రం మూడు రోజుల క్రితం తిరిగి ఓపెన్ చేశారు. ఈ కేంద్రం ద్వారా ప్రతి రోజు 30నుంచి 40 టిప్పర్ల వరకు ఇసుక రవాణ అవుతున్నది. అయితే పరిమితికి మించి ఓవర్‌లోడ్‌తో ఇసుక తరలింపుతో ప్రతి రోజు రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. దానికితోడు ఓవర్‌లోడ్‌తో వచ్చే వాహనాలతో రోడ్లు ధ్వంసం అవుతూ రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాహనదారులు, పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్న ఈ ఇసుక వ్యాపారంపై విజిలెన్స్ అధికారులు ఒకరోజు ఒక టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేయడంతో ఇది వెలుగులోకి వచ్చింది. అయితే అధికార పార్టీ నాయకుడి ఆగ్రహానికి గురైన విజిలెన్స్ అధికారులు టిప్పర్లను పట్టుకోకుండా నివేదికను ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం. అయితే అధికలోడ్‌తో వస్తున్న టిప్పర్లను గద్వాల పోలీసులు పట్టుకొన్న పది నిమిషాలలోనే తిరిగి టిప్పర్లు బయటకు రావడం చూస్తుంటే పోలీసులపై ఎంత ఒత్తిడి ఉందో అర్థం అవుతున్నది. వీటిని గమనిస్తున్న ప్రజలు మాత్రం అధికార పార్టీని, నాయకులను తిట్టి పోసుకుంటున్నారు.

టిప్పర్‌కు రూ.7వేలు అధికం

ఇసుక రీచ్ నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న దాని ప్రకారం ఇసుకను లోడింగ్ చేసి వేబిల్లు ఇచ్చి పంపించాలి. కానీ ఒక టిప్పర్‌కు 19.5టన్నుల ఇసుక వేయాల్సి ఉండగా అధికంగా ఏడు నుంచి ఎనిమిది టన్నుల వరకు ఎక్కువ ఇసుకను వేసి ఒక్కో టిప్పర్ నుంచి రూ.7వేల నుంచి రూ.7,500 వరకు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ఇసుక అక్రమంగా బయటకు రావడమే కాకుండా.. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతున్నది. నిర్వాహకులు ప్రతి రోజు లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. గతంలో ఇసుక రీచ్ నిర్వహించిన నిర్వాహకుల నుంచి కమీషన్‌ను తీసుకునే అధికార పార్టీ నాయకులు ఇందులోని లొసుగులను కనిపెట్టి ఏకంగా వారే దీనిని స్వంతం చేసుకున్నారు. తుమ్మిళ్ల గ్రామం వద్ద టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక కేంద్రాన్ని మూడేళ్ల క్రితమే ఏర్పాటు చేశారు. దీని ద్వారానే ఇసుక అవసరాలు తీరడంతో పాటు ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. అయితే గత ఐదు నెలలుగా ఈ ఇసుక కేంద్రం మూతపడింది. రాజకీయ నాయకుడి కమీషన్ ఒత్తిడికి నిర్వాహకులు తట్టుకోలేక పోయారు. ఎనిమిది నెలలుగా ఈ ఇసుక కేంద్రం మూతపడింది. దీనిని ఇప్పుడు అధికార పార్టీలోని నాయకులు దక్కించుకున్నారు.

విజిలెన్స్ అధికారుల పరిశీలనతో వెలుగులోకి....

ఉమ్మడి మహబూబ్ నగర్‌లో అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతున్నట్లు కథనాలు రావడంతో సీఎం పేషీ నుంచి ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది. మూడు రోజుల క్రితం గద్వాల జిల్లాకు విజిలెన్స్ అధికారులు వచ్చారు. ఇసుక రీచ్ వద్ద పరిశీలన చేయగా సీసీ కెమెరాలు, వెయింగ్ మిషన్ లేని విషయాన్ని గుర్తించి ప్రాజెక్టు ఆఫీసర్ దృష్టికి తెచ్చినట్లు తెలుస్తున్నది. అదే రోజు అధికలోడ్‌తో వస్తున్న టిప్పర్‌ను మల్దకల్ వద్ద గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దానిని ఆర్డీవోకు అప్పగించారు. అదే విధంగా గద్వాల పోలీసులు కూడా ఓవర్‌లోడ్ టిప్పర్లను పట్టుకుంటున్నప్పటికీ పోలీస్ స్టేషన్‌కు తరలించిన పది నిమిషాలలోనే బయటకు వస్తుండటం గమనార్హం. దీనిని బట్టి చూస్తే పోలీసులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడి ఏవిధంగా ఉందో అర్థం అవుతున్నది. ఓవర్‌లోడ్‌పై వివరణ కోరేందుకు రీచ్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీకాంత్‌కు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కేంద్రం వద్ద లేని సీసీ కెమెరాలు, వెయింగ్ మిషన్

ఇసుక రీచ్ వద్ద సీసీ కెమెరాలతో పాటు వేయింగ్ మిషన్‌ను కాంట్రాక్టర్ ఏర్పాటు చేసుకోవాలి. కానీ ఇది ప్రారంభం అయినప్పటి నుంచి సీసీ కెమెరాలు, వేయింగ్ మిషన్ లేకపోవడంతో ఎంత ఇసుకను నది నుంచి తీశారు.. ఎంత ఇసుక బయటకు పోతున్నదో కనిపెట్టలేకపోతున్నారు. ప్రస్తుతం ఇసుక రీచ్ వద్ద దాదాపు 50వేల క్యూబిక్ మీటర్లకు పైగా ఇసుక ఉన్నట్లు తెలుస్తుంది. కానీ రికార్డుల్లో మాత్రం 50 నుంచి 60శాతం వరకు మాత్రమే చూపించినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఎక్కువగా ఉన్న ఇసుకను ఓవర్‌లోడ్‌తో అక్రమంగా రాజమార్గంలో తరలిస్తున్నారు.

సీసీ కెమెరాలు, వేయింగ్ మిషన్ ఉంటే ఈ అక్రమ ఓవర్‌లోడ్‌ను నిరోధించవచ్చు. అందుకే దీనిని కాంట్రాక్టర్, నిర్వాహకులు ఏర్పాటు చేయకుండా లక్షల రూపాయలను వెనుకేసుకుంటున్నారు.

భగవంతుడిని ఆరాధిస్తూ సన్మార్గంలో నడవాలి

- ఉడిపి శిరూర్ మఠం పీఠాధిపతి వేదవర్ధన తీర్థులు



పేట రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామిజీ

నారాయణపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భగవంతుడిని ఆరాధిస్తూ సన్మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలని ఉడిపి శిరూర్ మఠం పీఠాధిపతి వేదవర్ధన తీర్థులు అన్నారు. ఆదివారం నారాయణపేట మండలం కోటకొండ నరసాచల శ్రీనివాస దేవాలయంలో మూలరాములు సంస్థాన పూజ అనంతరం భక్తులనుద్దేశించి ఆయన ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం నారాయణపేటలోని బ్రాహ్మణవాడి కృష్ణ దత్తమందిర్, పళ్ల శ్రీరామవేంద్రస్వామి దేవాలయం, ఉత్తరాది మఠం వేంకటేశ్వరస్వామి దేవాలయాలను స్వామిజీ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సీతారామారావు, జయతీర్థ ఆచార్య, జనార్దన్‌రావు, పద్మనాభ, ప్రభంజన్‌రావు, శ్రీనివాస్, భరత్, అనిల్‌దేశాయి, మంజునాధ్ జ్యోషి, ప్రహ్లాద, శ్రీహరి, హరీష్‌ఆచార్య, అనంత్‌రావు, రాఘవేందర్‌రావు, జయ తీర్థ, గోపినాథ్ తదితరులు ఉన్నారు.

అనంత సాగర్‌లో బొడ్రాయి వార్షికోత్సవం

- బోనాలతో బయలెల్లిన మహిళలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

తెలకపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అనంత సాగర్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంకాలం ఘనంగా బోనాల ఉత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా బొడ్రాయి దగ్గరికి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన వరద

- విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

ధరూరు/ దోమలపెంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పడుతోంది. దీంతో జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి నీటి విడుదలతో పాటు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. ఎగువ నుంచి వరద లేకపోవడంతో కేవలం కాలువల ద్వారానే నీటి విడుదల కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎగువన ఆల్మటి జలాశయంలో 58 టీఎంసీలకు నీరు నిల్వ ఉండగా, దిగువన నారాయణపూర్ జలాశయంలో 29 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుతం జూరాల జలాశయంలో నీటి మట్టం 318.120 మీటర్లకు చేరింది. 5.143 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆదివారం జలాశయానికి 5 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో నమోదయ్యింది. నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 750, భీమా లిఫ్ట్-1కు 650, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 315, మొత్తంగా జూరాల ప్రాజెక్టు నుంచి 1,807 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టులో 55 టీఎంసీల నీటి నిల్వ

ఎగువన ఉన్న సుంకేసుల ప్రాజెక్టు నుంచి 1,785 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుండగా, ఆదివారం నాటికి శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు ఇలా ఉన్నాయి. పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 835.40 అడుగులకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను 55.3581 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల వ్యవధిలో కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో 1,005 క్యూసెక్కుల నీటిని వినియోగించి 0.605 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 3,213 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 1.480 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 4,523 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పాదన ద్వారా సాగర్‌కు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

నిజాలను నిర్భయంగా రాయాలి

- అలా రాస్తేనే సమాజానికి మేలు
- అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు వర్తింపజేస్తాం
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



ఎమ్మెల్యే మేఘారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న జిల్లా జర్నలిస్టులు

వనపర్తి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉండే జర్నలిస్టులందరూ నాకు ఆత్మీయులేనని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నియోజకవర్గ జర్నలిస్టులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాలను నిర్భయంగా రాయడమే నిజమైన జర్నలిజం వృత్తి, కానీ ఒక్కసారి వార్త బయటికి వెళ్లే ముందు వాస్త అవాస్తవాలను తెలుసుకుని రాస్తేనే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదిగిన తనకు జర్నలిస్టుల సాదకబాధకాలు తెలుసని అన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండలాల్లోని జర్నలిస్టులకు అవసరమైన ప్రెస్‌క్లబ్ భవనాలు, ఇళ్ల స్థలాలు ఏర్పాటు కోసం త్వరలోనే కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అంతే కాకుండా జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవనానికి అనువైన స్థలంతో పాటు, నిధులు కూడా మంజూరు చేయించే బాధ్యత తనదేనన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డిని ప్రెస్ కమిటీ తరఫున జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం జర్నలిస్టులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. జర్నలిస్టులు రవీందర్‌రెడ్డి, రమేష్, కొండన్న యాదవ్, లక్ష్మణ్, భాస్కర్, మహమ్మద్ ఖలీల్, రాము తదితరులు పాల్గొన్నారు.

11న ఎస్టీ బాలికల గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

కల్వకుర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణ సమీపంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ సీఈసీలో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.పార్వతమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ఉదయం 10 గంటలకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలని ఆమె కోరారు. మరింత సమాచారం కోసం 9490957316ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ అన్నారు.

ఆటల బడి రమ్మంటోంది



స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు గత సంవత్సరం నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

(5వ పేజీ తరువాయి)

ఎంపికైన విద్యార్థులను రెండేళ్లపాటు ప్రత్యేక వ్యాయామాలు నేర్పించి, ఏ ఆటలో రాణించే అవకాశం ఉంటుందో అందులో నిపుణులైన కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తారు.

ఎంపికలకు తేవాల్సిన ధ్రువప్రతాలు..

విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, హెచ్‌ఎం జారీ చేసిన 3వ తరగతి బోనఫైడ్, ఉత్తీర్ణత సాధించిన ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో పోటీలకు హాజరుకావాలి. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తీస్తే కఠినమైన చర్యలు తీసుకుంటారు.

మూడు స్థాయిల్లో ఎంపికలు..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అర్హత పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నెల 16 నుంచి 19 వరకు మండల స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఎంపికలు నిర్వహిస్తారు. ఇక్కడ కనీసం 10 పాయింట్లు సాధిస్తేనే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జూలై 1 నుంచి 5వ తేదీ వరకు మేడ్చల్ జిల్లాలోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపికలు నిర్వహిస్తారు. అక్కడ ఎంపికైన వారికి వారికి నాలుగో తరగతిలో ఆగస్టులో ప్రవేశాలు కల్పిస్తారు.

ఎంపిక అర్హతలు..

ప్రవేశాల కోసం 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు ఉండాలి. 2016 సెప్టెంబరు 1 నుంచి 2017 ఆగస్టు 31 మధ్యకాలంలో జన్మించిన వారు అర్హులు.

కావాల్సిన ధ్రువపత్రాలు.....

- ఒరిజినల్ ఆధార్‌కార్డు
- 4వ తరగతి చదువుతున్నట్లు సర్టిఫికెట్
- వయస్సు ధ్రువీకరణ పత్రం
- 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు
- కమ్యూనిటీ సర్టిఫికెట్
- ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు

సామర్థ్య పరీక్షలు..

విద్యార్థుల ఎత్తు, బరువు కొలుస్తారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 60 మీటర్ల షటిల్‌రన్, 800 మీటర్ల పరుగుల పందెం, స్టాండింగ్ బ్రాండ్ జంప్ పోటీలు, ఫ్లెక్సిబిలిటీ, మెడిసిన్ బాల్‌త్రో తదితర పరీక్షలు నిర్వహిస్తారు.

ఈ నెల చివరి వారంలో జిల్లా స్థాయి ఎంపికలు



చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు సువర్ణ అవకాశం. మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి జిల్లా స్టేడియం మైదానంలో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఈ నెల చివరి వారంలో జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తేస్తే కఠిన చర్యలు తప్పవు.

\- ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

వీరు అనర్హులు..

దొడికాళ్లు, ఫ్లాట్ ఫీట్, వెన్నుముక వంగి ఉన్నవారు ఎంపికలకు అనర్హులు. గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, బౌలెగ్స్ కలిగిన వారు, శరీరంలో ఎముకలు విరిగిన విద్యార్థులు కూడా అనర్హులు.

ఎంపికైన వారికి ఉద్యోగ అవకాశాలు

క్రీడా పాఠశాలకు ఎంపికైన వారికి అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, రోయింగ్, వాలీబాల్, జూడో, బాక్సింగ్, ఫెన్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన వారికి భవిష్యత్తులో రైల్వే, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పోలీస్, బ్యాంక్స్, పోస్టల్ శాఖ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, పీఈటీ, పీడీ, కోచ్‌లు, కార్పొరేట్ సెక్టార్లలో మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

భారీ వర్షంతో రైతులకు ఊరట

మన్ననూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మృగశిర కార్తె ప్రవేశించిన రోజే నల్లమల ప్రాంతంలో ఆదివారం భారీ వర్షం కురువడంతో రైతులకు ఊరట లభించింది. అమ్రాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో రోహిణి కార్తెలోనే తొలకరి వర్షాలు కురవడంతో భూములను చదును చేసుకొని రైతులు విత్తనాలు చల్లారు. వారం రోజులుగా ఎలాంటి వర్షం కురవకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్న వేళ, ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా నల్లమల ప్రాంతంలో వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదివరకే విత్తనాలు వేసిన రైతులు మొక్కలు మొలవని చోట మళ్లీ విత్తనాలు చల్లేందుకు సిద్ధమవుతుండగా, విత్తనాలు వేయని వారు సోమవారం నుంచి విత్తనాలు వేసేందుకు సిద్ధమవు తున్నారు.

నల్లమలలో దారుణ హత్య



రాముడు (ఫైల్)

కొల్లాపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని నల్లమల అటవీ సమీప గ్రామం మొలచింతలపల్లిలో ఆదివారం రాత్రి దారుణ హత్య జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మద్దిలేటి రాముడు (45), అదే గ్రామానికి చెందిన చటమోని రాముడు అనే వ్యక్తికి తడకలకు సంబంధించిన డబ్బులు ఇచ్చేది ఉంది. ఈ విషయంపై గ్రామంలోని భ్రమరాంబ కాలనీ సమీపంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న చటమోని రాముడు మద్దిలేటి రాముడిపై కత్తితో తీవ్రంగా దాడి చేశాడు. దీంతో అతడు కుప్పకూలిపోయాడు. గమనించిన గ్రామస్థులు కేకలు వేయడంతో చటమోని రాముడు పారిపోయాడు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు కొల్లాపూర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

ఆదివాసీల జీవితం అగమ్యగోచరం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్

అచ్చంపేటటౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ ప్రజల దైనందిన జీవితం అగమ్యగోచరంగా మారిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలో టీఎన్‌జీవో భవనంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెరుముల గోపాల్ అధ్యక్షతన ఆపరేషన్ కగారును నిలిపివేయాలని ఏర్పాటు చేసిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్, యురేనియం జేఏసీ నాయకులు నాసరయ్య, పలు సంఘాల నాయకులు లక్ష్మీనారాయణతో కలిసి రాజేందర్ పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ దేశంలో తన పిల్లలనుత తానే చంపుకోవడం రాజ్యాంగానికి విరుద్ధమని, మవోయిస్టు పార్టీ పట్ల భిన్నాభిప్రాయం ఉండొచ్చు కానీ, రాజ్యాంగ ఆదర్శాలను కేంద్రం పాటించలేదన్నారు. మావోయిస్టు పార్టీ ప్రభుత్వ బలగాల మధ్య అమాయక ఆదివాసీ ప్రజల జీవితం అగమ్య గోచరంగా తయారైందన్నారు. భారతదేశంలో నిక్షిప్తమైన సహజవనరులను అదానీ, అంబానీ వంటి గుజరాత్ పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పజెప్పడం కోసమే ఈ మారనకాండ సాగిస్తున్నారన్నారు. మావోయిస్టు పార్టీపైన హత్యాకాండ కొనసాగుతోందని, వెంటనే ఈ ఆపరేషన్ కగారును నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంబయ్య, బాలయ్య, బాలకిష్టయ్య, శ్రీశైలం, యాదయ్య, కృపానందం, ప్రేమ్ కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల పిడుగుపాటు

- నాలుగు పశువులు మృతి

బిజినేపల్లి/చారకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు రెండు కాడెద్దులు, మరో రెండు గేదెలు మృతి చెందాయి. బిజినేపల్లి మండలం కొట్టాల్‌గడ్డలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో పాటు పిడుగుపడి రెండు కాడెద్దులు మృత్యువాత పడ్డాయి. బాధిత రైతు క్యామ శ్రీశైలం తెలిపిన వివరాల మేరకు... రోజులాగే పొలంలోని చెట్టుకు కాడెద్దులను కట్టేసి పొలం పనులు చేసుకుంటున్నాడు. ఒకసారిగా వర్షం మొదలవడంతో ఇంటికి వెళ్లాడు. వర్షం ఆగిన తర్వాత పొలం వద్దకు వెళ్లగా పిడుగుపాటుకు గురై రెండు కాడెద్దులు మృతి చెందాయి. దాదాపు రూ.1.5 లక్షల విలువైన కాడెద్దులు మృతి చెంది రోడ్డున పడ్డ రైతు క్యామ శ్రీశైలంను ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ మాధవి, మాధవ రెడ్డి, గ్రామస్థులు కోరారు.

● ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపడి ఆదివారం సాయంత్రం చారకొండ మండలంలోని సిరసనగండ్ల గ్రామంలో జటామోని అంజయ్యకు చెందిన రెంగు గేదెలు మృతి చెందాయి. అంజయ్య తన వ్యవసాయ పొలంలో గేదెలను కట్టేసి ఇంటికి వచ్చి తిరిగి వచ్చి సాయంత్రం పాలు పితికేందుకు వెళ్లగా అప్పటికికే పిడుగు పడి రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెంది కనిపించాయి. వాటి విలువ రూ. 2లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

రేపటి తరం కోసం పుస్తకావిష్కరణ



ఆవిష్కరణ అనంతరం తల్లిదండ్రులకు పుస్తకం అందిస్తున్న కవి ఎజ్జు మల్లయ్య

కోడేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి గ్రామానికి చెందిన యువకవి ఎజ్జు మల్లయ్య రచించిన " రేపటి తరం కోసం" కవితా సంపుటి పుస్తకం ఆవిష్కరించారు. ఆదివారం నర్సాయిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు పి.నాగయ్యగౌడ్, నెలపొడుపు సాహితీ సాంస్కృతిక వేదిక గౌరవ అధ్యక్షుడు కందికొండ మోహన్ ఆవిష్కరించారు. అనంతరం సభాధ్యక్షుడు వేదార్థం మధుసూదన్‌శర్మ ఆహ్వానం పలుకులతో సభా కార్యక్రమం ప్రారంభమైంది. 2020లో కరోనాపై రాసిన కవితలు అన్నింటినీ ఎజ్జు మల్లయ్య కవితా సంపుటిగా రచించి, దానిని తల్లిదండ్రులకు అంకితమిచ్చారు. ఇందులో కవిత శైలిని కవి అంతరాత్మను పుస్తక సమీక్ష ద్వారా డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్ వివరించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు బస్వోజు సుధాకర్ ఆచారి నెలపొడుపు సాహితీ వేదిక అధ్యక్షుడు వలపట్ల సుబ్బయ్య, కవులు ఎదిరేపల్లి కాశన్న, ముచ్చర్ల దినకర్, వహీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల మాంసం సేకరణ

- వ్యక్తిపై కేసు నమోదు

గోపాల్‌పేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పశువుల మాంసం విక్రయిస్తున్నాడని మండలంలోని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పశువుల మాంసాన్ని జిల్లా కేంద్రానికి విక్రయిస్తున్నాడని సమాచారం అందుకున్న జిల్లా హిందూవాహిని కార్యకర్తలు అతని ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా.. అక్కడ గోవు మాంసం కళేబరాలు కనిపించడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో హిందూ వాహిని కార్యకర్తలు సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు, పశు సిబ్బంది వెళ్లి అతని ఇంటిపై తనిఖీ చేయగా.. అక్కడ పశువుల మాంసం కళేబరాలు 14 పశువుల చర్మం ఉండడంతో వాటిని శాంపిల్స్‌గా తీసుకుని హైదరాబాద్ టెస్టులకు పంపించినట్లు ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు. పశువుల మాంసం అమ్మిన సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

చెరువులో పడి వ్యక్తి మృతి

గండీడ్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా కోస్గి మండలం మల్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అలికే మొగులయ్య (45) ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన గొర్రెల కాపరి నర్సయ్యతో కలిసి చెరువులో గొర్రెలను కడిగేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో లోతు పరిశీలించుటకు మొగులయ్య చెరువులోకి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించి నర్సయ్య వెంటనే నీటిలో మునిగిన వ్యక్తిని బయటికి తీయగా, అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా వ్యక్తి మృతి

- అమ్మమ్మను ఖననం చేసేందుకు కట్టెలకు వెళ్లి తిరిగి రాని లోకాలకు ..


బోల్తాపడిన ట్రాక్టర్


బాలవర్ధన్‌రెడ్డి (ఫైల్)

గండీడ్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అమ్మమ్మను ఖననం చేసేందుకు ట్రాక్టర్ తీసుకొని కట్టెలు తీసుకొచ్చేందుకు వెళ్లిన ఓ యువకుడు ట్రాక్టర్ బోల్తా పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం బల్సూర్ గొండ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బల్సూర్ గొండ గ్రామానికి చెందిన మల్లెపల్లి పద్మమ్మ (70) శనివారం రాత్రి మృతి చెందింది. అమ్మమ్మను ఖననం చేసేందుకు మనవడు మల్లెపల్లి బాలవర్ధన్‌రెడ్డి (40) ఆదివారం ఉదయం ట్రాక్టర్ తీసుకొని వెళ్లాడు. కట్టెలు తీసుకొని తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్రాక్టర్ కింద పడిన బాలవర్ధన్‌రెడ్డిని తీయగా మృతి చెందినట్లు గుర్తించారు. ఒక్క రోజే అమ్మమ్మ, మనుమడు బాలవర్ధన్‌రెడ్డి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

లారీ, బస్సు ఢీకొని క్లీనర్ మృతి

- ఐదుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు

పెబ్బేరు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన బస్సు ఢీకొనడంతో క్లీనర్ మృతిచెందిన సంఘటన పెబ్బేరు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చొటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వరుసగా రెండు లారీలు, ఒక బస్సు వెళ్తున్న క్రమంలో పెబ్బేరు మండలం తోమాలపల్లె వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఇసుక లారీ సడన్‌గా రోడ్డుపై ఆగిపోయింది. మధ్యలో వస్తున్న మరో లారీ సడన్ బ్రైక్ వేయడంతో వెనకాల వస్తున్న బస్సు వేగం కంట్రోల్ కాలేక ముందు వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బస్సు క్లీనర్ నాగేంద్రప్రసాద్(19) కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఐదుగురు ప్రయాణికులకు గాయాలైనట్లు తెలిపారు. మృతి చెందిన క్లీనర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కడప జిల్లా, కాజీపేట మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిపారు. గాయపడిన ప్రయాణికులను పెబ్బేరు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి వివరించారు.

ఆవు దూడపై చిరుత దాడి

- కొత్తపాలెం శివారులో ఘటన

ధరూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చిరుతపులి దాడిలో ఓ లేగ దూడ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామ సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతు రమేష్ తన వ్యవసాయ పొలం వద్ద శనివారం రాత్రి లేగదూడను కట్టివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం యధావిధిగా పొలానికి వచ్చిన రైతుకు లేగదూడ చనిపోయి కనిపించింది. దీంతో గ్రామస్థులతో కలిసి స్థానిక రెవెన్యూ సిబ్బందికి, పోలీసులకు, ఫారెస్టు అధికారులకు సమాచారం అందించాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మిడ్జిల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వేముల గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు కథనం ప్రకారం.. రాజాపూర్ మండలం చిన్నరేవల్లి గ్రామ పంచాయతీ పోచమ్మగడ్డ తండాకు చెందిన ఉడిత్యావత్ చంద్రునాయక్ నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఎర్రగుంటతండాలో జరిగిన బంధువుల వివాహ కార్యక్రమానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వేముల గ్రామ శివారులోని వెలిజాలకు వెళ్లే రోడ్డుపై బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. స్థానికులు జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తర లించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మక్తల్ నేతలకు కలిసి వచ్చిన మంత్రి పదవులు

- ముదిరాజ్ సామాజిక బీసీ వర్గానికి ప్రాధాన్యం
- మంత్రులుగా కాంగ్రెస్‌లో నాడు కళ్యాణి, నేడు వాకిటి శ్రీహరి
- టీడీపీలో ఎల్కోటి ఎల్లారెడ్డి మంత్రిగా రాణింపు


కల్యాణి రాంచందర్‌రావు (పాతచిత్రం)


ఎల్కోటి ఎల్లారెడ్డి (పాతచిత్రం)

నారాయణపేట, జూన్ 8 (ఆంధజ్యోతి): మక్తల్ నేతలకు మంత్రి పదవులు కలిసి వచ్చాయి. కాంగ్రెస్‌లో నాడు కల్యాణి రాంచందర్‌రావుకు, నేడు వాకిటి శ్రీహరికి మంత్రి పదవులు దక్కడం విశేషం. కొత్త జిల్లాగా ఏర్పడ్డ నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచిన వాకిటి శ్రీహరికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో ముదిరాజ్ సామాజిక బీసీ వర్గానికి ప్రాధాన్యతనిస్తూ మంత్రి పదవి వాకిటి శ్రీహరికి వరించింది. గత ఏడాది పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభలో ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ కేటగిరీకి మారుస్తాం అని, మంత్రివర్గ విస్తరణల ముదిరాజ్‌లకు స్థానం కల్పిస్తామని మంత్రి పదవి వాకిటి శ్రీహరికి ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. కాంగ్రెస్ నుంచి ఒక్కరే ముదిరాజ్ ఎమ్మెల్యే ఉండడంతో వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వరించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ముదిరాజ్ బీసీ సామాజిక వర్గంతో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గతంలో మక్తల్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా ఎన్నికైన ఇద్దరికి అప్పట్లో మార్కెటింగ్ శాఖ కలిసి వచ్చిందని పేర్కొనవచ్చు. కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మక్తల్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా గెలుపొందిన రాంచందర్‌రావు కళ్యాణి, ఎల్కోటి ఎల్లారెడ్డిలు మార్కెటింగ్ శాఖ మంత్రులుగా పనిచేసి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. 1972లో కాంగ్రెస్ పార్టీ నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాంచందర్‌రావు కళ్యాణి అప్పటి సీఎం కాసు బ్రహ్మానందారెడ్డి హయాంలో మార్కెటింగ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 1994లో అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎల్కోటి ఎల్లారెడ్డి 1995లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వ హయాంలో మార్కెటింగ్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇలా కాంగ్రెస్, టీడీపీ నుంచి గెలుపొందిన ఇరువురు నేతలు మార్కెటింగ్ శాఖ మంత్రులుగా పనిచేయడంతో మక్తల్ నియోజకవర్గానికి మార్కెటింగ్ శాఖ కలిసి వచ్చిందని చెప్పవచ్చు. తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వరించింది. ఏ శాఖ కేటాయింపు జరుగుతుందోన్న ఆసక్తికర చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లో కొనసాగుతోంది.


మాగనూరులో కాంగ్రెస్ నాయకుల సంబురాలు

జిల్లాకు జోడు పదవులు

కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు జోడు పదవులు వరించాయి. ఇదివరకే కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. తాజాగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వరించింది. దీంతో రాష్ట్ర స్థాయిలో ఇరువురు నేతలకు గుర్తింపు లభించింది.


పేటలో స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకుంటున్న నాయకులు

కార్యకర్త నుంచి కేబినెట్‌లోకి..

5వ పేజీ తరువాయి

నుంచి కాంగ్రెస్‌లోనే వివిధ బాధ్యతల్లో పనిచేసిన శ్రీహరి.. 2014లో మక్తల్ నుంచి జడ్పీటీసీగా గెలుపొందారు. అదే సమయంలో జిల్లా పరిషత్‌లో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్నారు. పార్టీలో డీసీసీ జనరల్ సెక్రటరీగా పని చేశారు. 2022లో నారాయణపేట డీసీసీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత దానికి రాజీనామా చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి.. సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై 17,525 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. భార్య లలిత కూడా ఎంపీటీసీగా పనిచేశారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉండటంతో మంత్రివర్గ విస్తరణలో ఆయనకు అవకాశం లభించింది.

దిగువ మధ్యతరగతి కుటుంబం..

శ్రీహరి దిగువ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. తండ్రి నర్సింహులు వ్యవసాయంతో పాటు చోటామోటా కాంట్రాక్టులు నిర్వహించేవారు. తల్లి రాములమ్మ స్టాఫ్ నర్సుగా పనిచేసి, రిటైర్ అయ్యారు. తల్లి రాములమ్మకు రాములమ్మ సిస్టర్‌గా ఆ ప్రాంతంలో పేరుంది. వేలాది కాన్పులు చేసి, ప్రఖ్యాతి పొందారు. శ్రీహరికి ముందు ఆ కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఏం లేదు. తను రాజకీయాల్లో వచ్చిన తర్వాత ఆ కుటుంబానికి నేపథ్యం వచ్చింది. భార్య లలిత కూడా ఒకసారి మక్తల్ మండలంలోని దాసరిపల్లి నుంచి ఎంపీటీసీగా పోటీచేసి, గెలుపొందగా.. తమ్ముడు యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, మక్తల్ పంచాయతీ వైస్ సర్పంచ్‌గా పనిచేశారు. మరదలు రాధిక కూడా కౌన్సిలర్‌గా, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా పని చేశారు. అచ్యుత్‌రామ్, అమిత్ సాయిరాజ్ ఇద్దరు కుమారులు కాగా.. మొదటి కుమారుడు అచ్యుత్‌రామ్ జాతీయ స్థాయిలో క్రికెటర్‌గా రాణిస్తున్నారు.


శ్రీహరిని గజమాలతో సత్కరిస్తున్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం, నాయకులు

మంత్రి శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు

మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వాకిటి శ్రీహరికి పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీహరి ఆదివారం మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుద్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు ఇచ్చి, పూల మాలలతో సత్కరించారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 14 నియోజకవర్గాలకు గాను 12 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. అందులో మెజారిటీ మొదటిసారి గెలిచిన వారే ఉన్నారు. మొత్తం 12 మందిలో జూపల్లి కృష్ణారావు సీనియర్ కావడం, అప్పటికే మంత్రి పదవులు చేపట్టిన అనుభవం ఉండటంతో సీఎంతోపాటు ఆయనకు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం దక్కింది. సీఎం, జూపల్లి కృష్ణారావు ఇద్దరు ఉమ్మడి జిల్లావారే కావడంతో మరో మంత్రి పదవి వస్తుందా? అనే సందేహం ఉండేది. తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండుసార్లు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లకు చెరో మంత్రి పదవి వచ్చింది. ఇప్పుడు కూడా అదే విధానం అవలంబిస్తారని కూడా ఆశించారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందేహాలకు చెక్ పెడుతూ.. ఎన్నికల బహిరంగ సభలో 14 పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ముదిరాజ్ బిడ్డను మంత్రిగా చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకుంటున్నాయి.


హైదరాబాద్‌లో మంత్రి శ్రీహరిని కలిసిన పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

మంత్రిని కలిసిన పేట ఎమ్మెల్యే

హైదరాబాద్ రాజ్‌భవన్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వాకిటి శ్రీహరిని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రిగారి అమ్మమ్మ ఊరులో..

సంబురాలు జరుపుకున్న కుటుంబీకులు

నారాయణపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అమ్మమ్మ శివమ్మ స్వస్థలం నారాయణపేట గొడుగేరిలో బంధువులు సంబురాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. గొడుగేరి అభయాంజనేయస్వామి దేవాలయంలో బంధువులు పూజలు చేశారు. నర్సిరెడ్డి చౌరస్తాలో బాణాసంచా కాల్చారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

మక్తల్/మాగనూరు/కృష్ణ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి వర్గంలో చోటు లభించడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణపేట జిల్లా వ్యాప్తంగా సంబురాలు చేసుకున్నారు. ఆదివారం మక్తల్ అంబేడ్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, సంబురాలు జరుపుకున్నారు. మాగనూరు మండలంలోని మాగనూరు, కొత్తపల్లి, వర్కూరు గ్రామాలతో పాటు వివిధ గ్రామాల్లోనూ కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. కృష్ణ మండల కేంద్రంతో పాటు, కున్సి, హిందూపూర్, ముడుమాల్ తదితర గ్రామాల్లో కూడా నాయకులు బాణసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు.


మక్తల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు



పేటలో సంబురాలు చేసుకుంటున్న మంత్రి బంధువులు

భయపెడుతున్న ఎనిమియా


ఉప్పల లోని జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది(ఫైల్)


వావిలాల జెడ్పీహెచ్‌ఎస్‌లో చిన్నారులకు ఎనిమియా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

- జోగుళాంబ గద్వాల జిల్లాలో 13,296 మంది గర్భిణులు
- వారిలో 25 శాతం మందికి రక్తహీనత
- 21,463లో మంది చిన్నారులలో 584 మంది తీవ్రం

గద్వాల క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో రక్తహీనత (ఎనిమియా) బాధితుల సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువగా పేదలే రక్తహీనత బారిన పడుతున్నారు. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడమే అందుకు కారణమని తెలుస్తోంది. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. కానీ పూర్తి స్థాయి వారికి అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పెరుగుతున్న బాధితుల సంఖ్య

జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి, ఎంసీహెచ్ సెంటర్, అలంపూర్ సీహెచ్‌సీ, లతో పాటు పీహెచ్‌సీల్లో గర్భిణుల వివరాలు ఇలా ఉన్నాయి. 2023, ఏప్రిల్ 1 నుంచి 2024, మార్చి వరకు జిల్లాలో 12,513 మంది గర్భిణులు ఉన్నారు. వారిలో 3,913 మందికి ఎనీమియా బాధితులున్నారు. 2024, ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు 13,296 మంది గర్భిణులు ఉండగా, వారిలో 4,132 మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూన్ 8 వరకు 2,467 మంది గర్భిణులు నమోదు కాగా, వారిలో 713 మంది ఎనీమియాతో బాధపడుతున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

ఎనిమియా ముక్త్ భారత్

జిల్లాలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా 'ఎనీమియా ముక్త్ భారత్' ప్రోగ్రాం ద్వారా 4 ప్రత్యేక బృందాలతో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జయరాజ్ తెలిపారు. గత ఏడాదిలో జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులు మొత్తం 21,463 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 584 మంది సీవియర్ (8 గ్రాముల కంటే హిమోగ్లోబిన్ తక్కువ), 7,021 మంది మోడరేట్ (8 నుంచి 11 గ్రాములు), 4,971 మంది మైల్డ్ (11 నుంచి 12 గ్రాములు), 8,363 మంది సాధారణం (12 గ్రాములకు పైగా) ఉంది. అలాగే ఈ ఏడాది ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో తీవ్ర సమస్య ఉన్న వారు 118 మంది, మాడరేట్ 4,462 మంది, మైల్డ్ 3,879 మంది, సాధారణం 5,669 మంది ఉన్నట్లు తేలింది. ఇంకా పరీక్షలు నిర్వహించాల్సి ఉండటంతో బాధితుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు నోడల్ అధికారి తెలిపారు. తీవ్ర సమస్య ఉన్న చిన్నారులకు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తం ఎక్కించే కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. అలాగే ఓ మోస్తరు ఇబ్బంది ఉన్న వారికి మందులు, ఇంజక్షన్లు ఇచ్చేలా చూస్తామన్నారు. వీరు పౌష్టికాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పౌష్టికాహారం తీసుకుంటే ఎనీమియా వ్యాధి మాయం అవుతుంది. అనీమియా నివారణకు ఆరోగ్యలక్ష్మీ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అన్నం, గుడ్లు, ఆకుకూరలతో పప్పు ఇస్తున్నాం. వాటితో పాలు కూడా పంపిణీ చేస్తున్నాం. అనీమియా ముక్త్ భారత్‌లో భాగంగా బలవర్ధక బియ్యాన్ని కూడా ఇస్తున్నాం. అలాగే గర్భిణులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ (ఐఎఫ్ఏ) మాత్రలు, చిన్నారులకు ఐరన్ ఫోలిక్ సిరప్‌ను ఇస్తున్నాం. ఎనీమియా నివారణకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం.

- సునంద, జిల్లా సంక్షేమాధికారి, గద్వాల

నేడు పీఎం జాతీయ అప్రెంటిస్ షిప్ మేళా

మన్ననూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని మన్ననూరు పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఆర్‌ఐటీఐ)లో సోమవారం ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్ లక్ష్మణ స్వామి తెలిపారు. కమిషన్, ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వివిధ పరిశ్రమల వారు ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, తమ కంపెనీల్లో అప్రెంటిస్ షిప్‌లో భాగంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. ఆర్‌ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ ఇండియా అనే వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

ఇంటర్వ్యూ..

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- రమేష్, వ్యవసాయాధికారి



ఉప్పునుంతల జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు విక్రయించి, రైతులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయాధికారి రమేష్ అన్నారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలపై మాట్లాడారు.

మండలంలో ఎన్ని ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయి, తనిఖీలు చేపడుతున్నారా?

మండలంలో మొత్తం 14 షాపులు ఉన్నాయి. వీటిపై టాస్క్‌ఫోర్స్‌తో పాటు మండల వ్యవసాయశాఖ తనిఖీలు చేపట్టి నకిలీ విత్తనాలు అరికడుతున్నాం.

భూసార పరీక్షలు చేపడుతున్నారా, ఈ ఏడాది ఎంత మంది రైతుల భూముల్లో చేపట్టారు?

ఈ సంవత్సరం 125 మంది రైతుల భూములకు సంబంధించిన మట్టిని భూసార పరీక్షలకు పంపించాం.

గత యాసంగిలో ఎంతమంది రైతులకు రైతుభరోసా డబ్బులు జమ అయ్యాయి?

రైతు భరోసా పథకం కింద రూ.23 కోట్లకు గాను రూ.18వేల కోట్లు రైతు ఖాతాల్లో జమ చేశారు.

వానాకాలం సాగుపై రైతులకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు ?

తొందరపడి విత్తనాలు నాటుకోవద్దు. నకిలీ విత్తనాలు నాటి మోసపోవద్దు. లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి. తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి. గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయాలు జరిపినట్లు గుర్తిస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలి.

న్యూస్ బాక్స్

నేడు ఎమ్మెల్యే వంశీకృష్ణ రాక

వంగూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంగూరు గేట్ సమీపంలోని వైవీ ఫంక్షన్‌హాలులో సోమవారం ఉదయం 11 గంటలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను పంపిణీ చేయడానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ రానున్నట్లు మాజీ సర్పంచ్ అల్వాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

చారకొండకు నేడు ఎమ్మెల్యే రాక

చారకొండ : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరైన ప్రొసీడింగుల పంపిణీ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సోమవారం మండల కేంద్రానికి రానున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ జమ్మికింది బాలరాంగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు కల్వకుర్తిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

కల్వకుర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో పీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 11గంటలకు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ ఉంటుందని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ తెలిపారు. కల్వకుర్తి పట్టణంతోపాటు నియోజకవర్గంలోని కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలు అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కార్యకర్తల సమావేశం

పట్టణంలో పీకేఆర్ ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం 2గంటలకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఉంటుందని ఆనంద్‌కుమార్ తెలిపారు. మండల కాంగ్రెస్, బ్లాక్, పట్టణ నూతన అధ్యక్షుల నియామక ప్రక్రియ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, జిల్లా ఇన్‌చార్జిలు బెల్ల య్యనాయక్, రాజశేఖర్ రెడ్డిలు హాజరవుతున్నట్లు ఆనంద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

వచ్చే నెల 8న దేశ వ్యాప్త సమ్మె

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 8న నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దశాబ్ద కాలం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించిందని పేర్కొన్నారు. దేశానికి సంపద సృష్టికర్తలు పెట్టుబడిదారులేనని మోదీ చెప్పడంతోనే కార్మికులు, కర్షకుల అభివృద్ధి పట్ల ఆయన చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు, సహాయ కార్యదర్శి రామయ్య, నాయకులు శివవర్మ, శివరాములు పాల్గొన్నారు.

రోడ్లను కమ్మేస్తున్న ముళ్ల కంప

- గ్రామీణ రహదారుల చుట్టూ ఏపుగా పెరిగిన ముళ్ల కంప
- మలుపుల వద్ద కనిపించని వాహనాలు
- తరచుగా చోటు చేసుకుంటున్న ప్రమాదాలు

బల్మూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల రహదారులు ముళ్లకంపతో మూసుకుపోయాయి. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం అయిందంటే గ్రామాలకు వెళ్లడానికి జంకాల్సిన పరిస్థితి.

మండల కేంద్రం నుంచి గోదల్ గ్రామానికి వెళ్లే రహదారి బీటీ రోడ్డు ఉన్నప్పటికీ చుట్టూ ముళ్ల కంప విపరీతంగా పెరిగి రాకపోకలకు ఆటంకంగా మారింది. నర్సాయిపల్లి నుంచి గోదల్‌కు వెళ్లే రహదారితో పాటు రామాజీపల్లి నుంచి చెన్నారం, చెన్నారం నుంచి గట్టుతుమ్మెన్, తుమ్మన్‌పేట నుంచి జిన్‌కుంట, కొండారెడ్డిపల్లి నుంచి చెన్నారం, ఏజెన్సీ గ్రామాలైన బాణాల నుంచి వెంకటగిరి, జిల్లాకల్, లక్ష్మీపల్లి, చర్ల్యగూడెం, మైలారం గ్రామాలకు ఆర్‌అండ్‌బీ రోడ్లతో పాటు మట్టి రోడ్లపై కూడా ఇలాంటి ముళ్లకంప చెట్లు ఏపుగా పెరిగి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి సంబంధిత శాఖ అధికారులు ఆయా గ్రామాల రోడ్లను పరిశీలించి రోడ్లకిరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



ముళ్ల కంపతో మూసుకుపోయిన గోదల్ గ్రామానికి వెళ్లే రోడ్డు

ముళ్ల కంపను తొలగించాలి



మండల కేంద్రం నుంచి మా గ్రామానికి బీటీ రోడ్డు అయినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంప పెరిగింది. ఆదమరిస్తే ప్రమాదం జరగక తప్పదు. మూలమలుపుల రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చే వాహనదారులు, సమీపానికి వచ్చే వరకు కనిపించక ప్రమాదాలు జరగనున్నాయి. రోడ్డుకిరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఎండీ ముస్తాక్, యువకుడు, గోదల్

కంపను తొలగించే పనులు చేపడతాం

గ్రామీణ ప్రాంతాలతో పాటు ఇతర రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. నియోజకవర్గం మొత్తంలో పని చేయడానికి త్వరలో కంపచెట్లను తొలగించి రహదారులు పూర్తిగా మంచిగా చేయడానికి ప్రయత్నం చేస్తాం. కాస్త నిధుల ఇబ్బంది ఉండడం వల్ల పని చేయలేక పోతున్నాం. నిధులు రాగానే, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రహదారులకు ఇరువైపులా చెట్లను తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

- సయ్యద్‌సోహెల్, మండల ఆర్‌అండ్‌బీ అధికారి, బల్మూరు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ బహుదూర్



తిమ్మాజిపేటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న నాయకులు

తిమ్మాజిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతాయని ఇది నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ బహదూర్ అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆదివారం బోయ మాధవులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులతో ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ మరెన్నో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. గూడు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదోళ్లను పట్టించుకోలేదన్నారు. మంజూరైన లబ్ధిదారులు త్వరలో ఇంటి నిర్మాణాలు చేపట్టి వెంటనే పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉస్మాన్, లక్ష్మీనారాయణ, రవూఫ్, లింగం, మల్లేష్, బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన బాలుర గురుకులం మంజూరు చేయాలి'

కల్వకుర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి నియోజకవర్గానికి గిరిజన బాలుర గురుకులాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని లంబాడీ హక్కుల పోరాట సమితి తాలూకా అధ్యక్షుడు చంద్రునాయక్ కోరారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 270గిరిజన తండాలున్నాయని సుమారు లక్ష వరకు జనాభా ఉందని పేర్కొన్నారు. గిరిజన బాలురల కోసం బాలుర గురుకుల పాఠశాల లేకపోవడంతో ఇక్కడి విద్యార్థులు ప్రభుత్వ చదువులకు నోచుకోక ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక మధ్యలోనే చదువులు ఆపేస్తున్నారని ఆయన అన్నారు. సమావేశంలో ఎల్‌పీహెచ్ఎస్ తాలూకా ఉపాధ్యక్షుడు హరిలాల్, నాయకులు లాలునాయక్, దాస్య నాయక్, వార్యనాయక్ ఉన్నారు.

నిరుపేదలకు అందని ఇందిరమ్మ ఇళ్లు

- స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్

తెలకపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరిట కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాత్రమే కేటాయించారంటూ స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ అన్నారు. సమావేశం నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రొసీడింగ్ పత్రాలను కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాత్రమే కేటాయించారని ఆయన ఆరోపించారు. ప్రజాధనంతో కూడిన ఈ పథకాలను కేవలం ఎమ్మెల్యే అనుచరులకు ఇవ్వడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా నిరుపేదల కుటుంబాలు ఇల్లు లేక బాధపడుతున్నారని తెలిపారు. నిన్న జరిగిన సభలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్జీ చేసుకోవడానికి వెళ్లిన పేదలను సభ నుంచి గెంటివేశారని వాపోయారు. వెంటనే నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు సంపత్ కుమార్, బొల్లె శివ, నాయకులు మూర్తి సాగర్, అరవింద్ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

- సీపీఎం మండల కార్యదర్శి పి.రవి

కోడేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరగాలని సీపీఎం మండల కార్యదర్శి పి.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక గ్రామ సభలో గ్రామసభ తీర్మానం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. సీపీఎం నాయకులు కాకం వెంకటయ్య, మండల కమిటీ నాయకులు మాలిక్, రవి, రాజు, వెంకటయ్య, బుచ్చయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

జర్నలిస్టుపై అక్రమ కేసు ఎత్తివేయాలి

- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు యాదగిరి, సాయిలు సాగర్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా అక్కడి 12 గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేయగా, ఇరు వర్గాల మధ్య జరిగిన ఘటనతో ఎలాంటి సంబంధం లేని జనంసాక్షి పత్రిక సంపాదకుడు రెహమాన్‌పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తి వేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సందు యాదగిరి, సాయిలుసాగర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటాన్ని కవరేజీ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో స్థానిక పోలీసులు కక్షపూరితంగా హైదరాబాదులో ఉన్న జనంసాక్షి ఎడిటర్‌పై అక్రమంగా కేసు పెట్టడం సరికాదన్నారు.

వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవిపై హర్షం

అమ్రాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు శాసన సభ్యుడు వివేక్ వెంకటస్వామికి కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రి పదవి ఇవ్వడంపై మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మద్దల దివాకర్, నేతలు లింగం, నిరంజన్ లు హర్షం ప్రకటించారు. ఆదివారం అమ్రాబాద్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల భవిష్యత్

- ఎంఈవో సత్యనారాయణశెట్టి



తిమ్మాజిపేట బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణశెట్టి

తిమ్మాజిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉందని, ప్రైవేట్ పాఠశాలలు వద్దని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణశెట్టి అన్నారు. మండల కేంద్రంలోని బోయగిరిలో ఆదివారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి పాల్గొన్న ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన ఉంటుందని, విశాలమైన తరగతి గదులు ఉంటాయని, ఆడుకోవడానికి మైదానాలు, తెలుగు, ఆంగ్లంలోనూ విద్యాబోధన ఉంటుందన్నారు. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుదామన్నారు. ఉపాధ్యాయులు అత్తర్ అలీ, జైపాల్‌రెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

● బిజినేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందుతుందని ప్రధానోపాధ్యాయుడు హనుమంత్ రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని నంది వడ్డెమాన్, సల్కర్‌పేట గ్రామాల్లో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపుతున్న తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమోహన్‌రెడ్డి, వెంకటస్వామి, కృష్ణకుమార్, హుస్సేన్, రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

● ఉప్పునుంతల : రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టిందని, విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామనితాడూర్ ప్రాథమికోన్నతపాఠశాల హెచ్‌ఎం జక్క రామస్వామి అన్నారు. బడిబాటలో బాగంగా గ్రామంలో ఇంటింట ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, శ్రీనువాసులు, వసంతకుమార్, గోపి, లక్ష్మీనారాయణ, కమల, పద్మ, గ్రామస్థులు చంద్రయ్య, కృష్ణయ్య, తిరుపతయ్య, అశోక్‌గౌడ్, శ్రీకాంత్ గౌడ్, శివ, తిరుపతయ్య పాల్గొన్నారు.

● అమ్రాబాద్ : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని కాలనీలలో సీపీఎస్ ప్రధానోపాధ్యాయులు ఇమ్మడి విజయమోహన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. అమ్రాబాద్‌లో ఇప్పటి వరకు 25 మంది విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో వారు ఒప్పుకున్నారని హెచ్‌ఎం విజయ మోహన్ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడూర్‌లో బాడిబాట కార్యక్రమంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



బిజినేపల్లి : నంది వడ్డెమాన్‌లో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి కె.గీత

- ఐద్వా జిల్లా కార్యదర్శి కె.గీత

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.గీత పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐద్వా కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో మహిళలపై ఎక్కడ దాడి జరిగినా ఐద్వా గళమెత్తుతూనే ఉందన్నారు. మహిళల కోరం పాలక పక్షాలు కొన్నిచట్టాలు తీసుకువచ్చినప్పటికీ చట్టాలు కొందరి చుట్టాలుగానే పని చేస్తున్నామని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కోసం, సొంతింటి కల నెరవేరేందుకు, రేషన్ కార్డుల కోసం, కూలీ రేట్లు పెంచేందుకు మహిళా సంఘాల వారి హక్కుల కసం ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నిర్మల, ఉపాధ్యక్షురాలు ఆదిలక్ష్మి, సహాయ కార్యదర్శి శివలీల, జిల్లా కమిటీ సభ్యులు చెన్నమ్మ, సైదమ్మ, ఈశ్వరమ్మ, గుండమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరికి ఘన సన్మానం



శ్రీహరిని సన్మానిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకుడు రాహుల్

కల్వకుర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం వాకిటి శ్రీహరిని కల్వకుర్తి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పుస్తకాల రాహుల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి మక్తల్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షునిగా తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదిగి క్యాబినెట్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ప్రమాణ స్వీకారం చేశారని పుస్తకాల రాహుల్ పేర్కొన్నారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ ఉన్నారు.

ప్రజల కోసం పని చేసే పార్టీ

- మండల మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం బాలనర్సింహా



మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాలనర్సింహా

పెంట్లవెల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పదవుల కోసం భారత కమ్యూనిస్టు పార్టీ పని చేయదని ప్రజల పక్షాన పోరాటాలు చేసి ప్రజా సంక్షేమ కోసం పాటు పడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలనర్సింహ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో న్యాయవాది చిన్న కురుమయ్య అధ్యక్షతన సీపీఐ మొదటి మహాసభలు నిర్వహించగా బాలనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బత్తిని రాము, జిల్లా కార్యదర్శి చిన్న కురుమయ్య, కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కిరణ్ కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు గోపాల్, మండల కన్వీనర్ దేవసహాయం, నిరంజన్ నాయుడు, సురేష్, ఏఐటీయూసీ నాయకులు సువర్ణ, రాజు, నరసింహ, శేఖర్, మండలంలోని ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

పెద్దకొత్తపల్లి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాయకులు, కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ మండల కార్యదర్శి బొల్లె ద్దుల శ్రీనివాసులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని దేదినేనిపల్లి గ్రామంలో సీపీఐ మహాసభ నిర్వహించారు. కల్వారి పెద్ద బాలస్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సీపీఐ పెద్దకొత్తపల్లి మండల 18వ మహాసభను వెన్న చెర్ల గ్రామంలో ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శిగా చిట్టాల రాధాకృష్ణ, సహాయ కార్యదర్శులుగా తిప్పరాజు, శివప్రసాద్, చిన్న బాలస్వామి, కోశాధికారిగా సుల్తాన్, సలహాదారుగా చుక్క మద్దిలేటితో పాటు మరో ఐదుగురు సభ్యులు కమిటీని ఎన్నుకున్నారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి నివాళి



హైదరాబాదులో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదు ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతదేహానికి నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మాగంటి గోపీనాథ్ ఇంటికి వెళ్లి ఆమర మృతదేహంపై పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు. మర్రి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందడం దురదృష్టమరమన్నారు. మాగంటి మృతి బీఆర్ఎస్ పార్టీకి, ఆయన కుటుంబానికి, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు తీరని లోటన్నారు.

సబ్సిడీతో పంపిణీకి జీలుగ విత్తనాలు సిద్ధం

అచ్చంపేట రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : 50శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తున్నట్లు అచ్చంపేట మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి 30 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని, 30కేజీల విత్తనాలు బస్తా ఒకటి 4,275 రూపాయలుకాగా 50శాతం సబ్సిడీతో రూ.2137.50లతో రైతులకు ఇస్తున్నామని, పట్టాదారు పాస్ బుక్ ప్రాతిపదికన విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 50శాతం సబ్సిడీతో పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అచ్చంపేట మండలంలోని రెవెన్యూ గ్రామాల రైతులు సద్వినియోగం చేసు కోవాలని ఆయన కోరారు.

వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్

- ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జూలై 7న ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రాం భవన్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సౌట కాశీం మాదిగ అధ్యక్షతన నిర్వహించినఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జీలు ఆడెపు నాగార్జున మాదిగ, మిద్దిలేటి మాదిగ పాల్గొని ఆవిర్భావ ఉత్సవాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జూలై 7 ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేసేందకు ఎమ్మార్పీఎస్ అనుబంధ ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు రాజు, దశరథం, కుర్మయ్య, ప్రభాకర్, అగ్రస్వామి, కృష్ణ, లక్ష్మణ్, మల్లేష్, రాజు, వెంకటేష్, వెంకటయ్య పాల్గొన్నారు.